సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా


సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

బంగారు వస్తువులు పోగొట్టుకుంటే సంప్రదించండి



బంగారు వస్తువులు

సీతమ్మధార: ఇటీవల బంగారు వస్తువులు పోగొట్టుకుంటే తగిన రశీదులతో ఫోర్త్ టౌన్ క్రైం పోలీసులను సంప్రదించాలని స్టేషన్ ఎస్‌ఐ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది నెలల కిందట దొండపర్తిలోని ఒక ఆటో డ్రైవర్‌కు మండగొలుసు, డైమండ్ పార్కు దరి సాయి పార్లర్ వద్ద చైను దొరికాయని తెలిపారు. వీటి కోసం ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో 106 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేశామని తెలిపారు. వస్తువులు పోగొట్టుకున్న బాధితులు తగు ఆధారాలతో క్రైం పోలీసులను సంప్రదించాలని, రశీదులు పరిశీలించి వస్తువులు ఇచ్చేస్తామని తెలిపారు.

హిజ్రాలకు నిత్యావసర సరకుల పంపిణీ

అల్లిపురం: జీవీఎంసీ 34,39 వార్డులకు చెందిన హిజ్రాలకు 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం నేరెళ్లకోనేరులో గల అతని కార్యాలయంలో ఆయన హిజ్రాలు భారతి, జ్యోతిక, బేబీ, మాధవి, విమల తదితరులకు నెల రోజులకు సరిపడా బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిక్షాటన మాని కష్టపడి బతకాలని సూచించారు. ఈ సందర్భంగా హిజ్రాలు మాట్లాడుతూ తాము కష్టపడి బతకాలని భావిస్తున్నామని, అందుకు తగిన విధంగా ఉపాధి కల్పించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వర, కుమారి, కోదండమ్మ, రాజు, కిషోర్, సరస్వతి, సంధ్య, పుష్ప, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

యువత క్రమశిక్షణతో మెలగాలి



ఆరిలోవ కాలనీలో యువతతో మాట్లాడుతున్న సీఐ గోవిందరావు

ఆరిలోవ: యువత క్రమ శిక్షణతో మెలిగి భవిష్యత్తు ఉన్నతికి బాటలు వేసుకోవాలని ఆరిలోవ సీఐ జి.గోవిందరావు సూచించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న వ్యవహారాలపై యువతకు ఆరిలోవ కాలనీలో మంగళవారం అవగాహన కల్పించారు. హెల్త్‌సిటీ వెనక ఖాళీ స్థలంలో ఆయన యువకులతో మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో కొందరు యువతీ యువకులు చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. గంజాయి, మద్యం, ఘర్షణల జోలికి వెళ్లకూడదన్నారు. ఈ ప్రాంతంలో గంజాయి తరలించే వారు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

- ఎడతెరిపి లేని వర్షాలకు శిథిలమైన రోడ్లు
- ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు, పాదచారులు
- మరమ్మతుచేయాలని కోరుతున్న స్థానికులు

రోడ్లిలా.. ప్రయాణమెలా?



మున్సిపల్ కాలనీకి వెళ్లే దారిలో ఏర్పడ్డ గొయ్యి

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు దక్షిణలోని పలు ప్రాంతాల్లో రోడ్లు శిథిలమయ్యాయి. ముఖ్యంగా రామకృష్ణా థియేటర్ వద్ద, మున్సిపల్ కాలనీకి వెళ్లే రహదారిలో, రామకృష్ణా రైతుబజార్ వద్ద గల రోడ్లు వర్షాలకు కొట్టుకుపోయి వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌కు సరకులు తీసుకొచ్చే లారీ, ఆటో, రిక్షా కార్మికులు కూడా ఈ దారుల్లో ప్రయాణించడం ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్లకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.



రామకృష్ణా రైతుబజార్ వద్ద ఏర్పడ్డ పెద్ద గొయ్యి

అల్లిపురం: ఇటీవల కురిసిన వర్షాలకు 34వ వార్డు పరిధిలో రోడ్లు శిథిలమయ్యాయి. గత నాలుగు రోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కారణంగా 75 ఫీట్ రోడ్డు, రామకృష్ణా థియేటర్ జంక్షన్ వద్ద గల రోడ్డు శిథిలమయ్యాయి. ఇక్కడ రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడటంతో భారీ వాహనాలతో పాటు, ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 75 ఫీట్ రోడ్డు నుంచి మున్సిపల్ కాలనీకి వెళ్లే రహదారి కుంచించుకి పోయి గొయ్యిలా ఏర్పడింది. దీని వలన వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.



రామకృష్ణా థియేటర్ జంక్షన్‌లో రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

రామకృష్ణా రైతుబజార్ వద్ద..

రామకృష్ణా రైతు బజార్ వద్ద గల రైలు పట్టాల వద్ద వర్షానికి పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా జ్ఞానాపురం, టౌన్ కొత్తరోడ్డు, జగదాంబ, పూర్ణామార్కెట్, కంచరపాలెం, ఎన్‌ఏడీ కొత్తరోడ్డు, గాజువాక తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా జ్ఞానాపురం హోల్‌సేల్ కాయగూరల మార్కెట్ నుంచి ఆటోరిక్షాలు, రిక్షాలు అధిక లోడ్‌తో వస్తుంటాయి. గోతుల వల్ల అవి ఒక్కోసారి తిరగబడిపోతున్నాయని ఆటో, రిక్షా కార్మికులు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు శిథిలమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

టెలికాం సేవలపై విస్తృత అవగాహన



మాట్లాడుతున్న టెలికాం ఏపీ శాఖ అడిషనల్ డీజీ జేవీ రాజారెడ్డి

డాబాగార్డెన్స్: అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం టెలికాం పాయింట్ ఆఫ్ సేల్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ టెలికాం శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ జేవీ రాజారెడ్డి, డైరెక్టర్ జీవీ మనోజ్‌కుమార్‌తో పాటు పీజీఎంటీడీ పాల్ విలియమ్స్, పీజీఎం (ఒ) ఆడమ్ గొల్లమూడి అవగాహన కల్పించారు. ప్రతి వినియోగదారుని టెలికాం సేవల నమోదు ప్రక్రియ, ఆన్ బోర్డింగ్ సమయంలో వినియోగదారుని పూర్తి వివరాలు సమగ్రంగా ధ్రువీకరించుకునే అంశానికి సంబంధించి ప్రాముఖ్యత గురించి వివరించారు. దేశీయంగా నానాటికీ పెరుగుతున్న సాంకేతికత, వివిధ సాంఘిక, ఆర్థిక కార్యకలాపాలకు ఉపయుక్తంగా ఉన్న ఆన్‌లైన్ సేవలు, టెలికాం వనరులు, మరీ ముఖ్యంగా మొబైల్ సేవలపై వివరించారు. పాయింట్ ఆఫ్ సేల్ ప్రతినిధి, సిమ్‌లు విక్రయించేవారు నకిలీ ధ్రువపత్రాలతో సిమ్ జారీ చేయకుండా చూసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, మోసపూరిత చర్యలకు పాల్పడుతున్న దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలన్నారు. భారత పౌరుల డాటా భద్రతకు టెలికాం శాఖ చేపడుతున్న వివిధ ప్రక్రియలు, ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన సంచార్ సాథి పోర్టల్‌పై అవగాహన కల్పించారు. భారత పౌరుడు తన పేరిట ఉన్న మొబైల్ కనెక్షన్స్ తెలుసుకుని, ఆయా మొబైల్ కనెక్షన్లను ఈ సంచార్ సాథి పోర్టల్ ద్వారా డిస్‌కనెక్ట్ లేదా బ్లాక్ చేసుకోవచ్చని, మొబైల్ ఫోన్ తస్కరించబడినట్టయితే ఆ మొబైల్ ఫోన్ వివరాలు, మొబైల్ డివైసెస్ యదార్థత ఈ పోర్టల్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చని చెప్పారు. నకిలీ, మోసపూరిత ఫోన్‌కాల్స్‌పై ఫిర్యాదును ఈ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని, అలాగే ఈ పోర్టల్ ద్వారా మీ టెలికాం ఆపరేటర్ వివరాలు, మొబైల్ ఈఎంఐ వివరాలు, విదేశీ కాల్స్ నుంచి వస్తున్న మోసపూరిత కాల్స్ వంటి సేవలు పొందవచ్చని చెప్పారు. సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలపై జాతీయ నేర ఫిర్యాదుల పోర్టల్ www.cybercrime.gov.in ఇప్పటికే పని చేస్తుందని, అంతేగాక 1930కి కాల్ చేసి ఫిర్యాదు చెయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో టెలికాం ఆపరేటర్ల ప్రతినిధులు, రిటైలర్లు, పాయింట్ ఆఫ్ సేల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలువపై బడ్డీ తొలగింపు



పోలీసుల సహాయంతో కాలువపై బడ్డీని తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

జగదాంబ: మురుగు కాలువను ఆక్రమించుకుని నిర్వహిస్తున్న కిళ్లీ బడ్డీని మంగళవారం జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తొలగించారు. 35వ వార్డు మంచాల వీధిలో ఓ భారీ కాలువ ఉంది. ఎనిమిది అడుగుల వెడల్పు, పది అడుగుల లోతు ఉన్న ఈ కాలువకు కేజీహెచ్ పైనుంచి నాలుగు వార్డుల కాలువల మురుగు నీరు వచ్చి చేరుతుంటుంది. ఈ కాలువపై ఒక వ్యక్తి బడ్డీ పెట్టుకుని వ్యాపారం చేస్తుండడంతో పారిశుధ్య కార్మికుల పనులు ముందుకు సాగడంలేదు. స్థానికులు ఈ బడ్డీ వ్యవహారంపై జీవీఎంసీ అధికారులకు అనేక ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో బడ్డీని తొలగించాలని చెప్పినప్పటికీ నిర్వాహకుడు పట్టించుకోలేదు. దీంతో జీవీఎంసీ అధికారులు వన్‌టౌన్ పోలీసుల సహాయంతో జేసీబీ తీసుకొచ్చి కాలువపై ఉన్న బడ్డీని తొలగించారు.

స్వాప్ డయేరియాపై అవగాహన కల్పించాలి

మహారాణిపేట: స్వాప్ డయేరియాపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం వాంబే కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. యూపీహెచ్‌సీ పరిధిలో గర్భిణులు ఎంత మంది ఉన్నారో జాబితా సిద్ధం చేయాలని, ఎనీమియా లబ్ధిదారులను గుర్తించాలని ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు తెలిపారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు అందచేయాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని తెలిపారు. ఓపీ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, వర్షా కాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మధురవాడ వాంబే కాలనీ యూపీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

కందిపప్పు నాణ్యత పరిశీలన



నరసింహనగర్ రైతుబజార్‌లో కందిపప్పు నాణ్యత పరిశీలిస్తున్న అధికారి ప్రవల్లిక

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు నాణ్యతను పౌరసరఫరాల శాఖ క్వాలిటీ చెకింగ్ ఆఫీసర్ పి.ప్రవల్లిక తనిఖీ చేశారు. విక్రయిస్తున్న సరుకుతో పాటు, ప్యాకింగ్‌లో ఉన్న కందిపప్పు, బియ్యం బస్తాలను పరిశీలించారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీఎం యాసిన్ నరసింహనగర్ రైతుబజార్‌లో పర్యటించారు. స్టాల్స్‌లో విక్రయిస్తున్న కూరగాయల నాణ్యత, తాజాదనం పరిశీలించారు. ప్రభుత్వం సబ్సిడీపై విక్రయిస్తున్న టమాటల కౌంటర్లు తనిఖీ చేసారు. డ్వాక్రా వ్యాపారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

ఉక్కు పరిరక్షణకు కేటాయింపులేవీ?

- బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్‌కు మొండిచెయ్యి
- స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్
- 1258వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

అగనంపూడి: ఎన్నికల ముందు విశాఖ ఉక్కు పరిరక్షణ మా వల్లే సాధ్యమని నమ్మబలికిన కూటమి ప్రభుత్వం నేడు పరిరక్షణకు బడ్జెట్‌లో కనీస కేటాయింపులు చేయకపోవడం అన్యాయమని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 1258వ రోజు, మంగళవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. రాజధాని అమరావతికి రూ.15వేల కోట్ల నిధులు కేటాయిస్తామని బడ్జెట్‌లో పొందుపర్చిన కేంద్రం విశాఖ ఉక్కు విషయంలో మాత్రం కనీసం కేటాయింపులు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ఆర్థిక సహాయం అందించాలని మూడున్నర సంవత్సరాలుగా విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోపోవడం, తీరా ఎన్నికల్లో ప్రజలకు బీజేపీకి సముచిత స్థానం ఇచ్చినా కూడా మొండిచేయి చూపడం దుర్మార్గమన్నారు. విశాఖ రైల్వే జోన్ విషయంలోనూ ఇదే తీరు కనపర్చారన్నారు. రాష్ట్రానికి అన్ని విధాలుగా నమ్మక ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలకు రాష్ట్రంపై ఎలాంటి అభిప్రాయం, ప్రేమాభిమానాలు ఉన్నాయో స్పష్టం అవుతోందన్నారు. కనీసం రెండు శాతం ఓట్లు కూడా లేని బీజేపీని పోటీ చేసిన దాదాపు అన్నిప్రాంతాల్లో గెలిపించిన రాష్ట్ర ప్రజలకు బీజేపీ చేసిన ద్రోహం అంతులేనిదన్నారు. దీక్ష శిబిరంలో నాయకులు కొమ్ము ప్రసాద్, పీవీబీవీ గోపాలరాజు, డి.ఆదినారాయణ, కె.సత్యనారాయణరావు, నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, జి.ప్రభాకర్ రెడ్డి, జి.గురుమూర్తి, మధు, వై.శ్రీను, ఆకుల నూకరాజు, దండు మోహన్, మద్ది అప్పలరాజుతో పాటు ఉక్కు పరిరక్షణ కమిటీ, ఇంటక్ నాయకులు, సీవో అండ్ సీసీపీ, సీఆర్ఎంపీ, ఈఎండీ, ఈఆర్ఎస్, డీఎన్‌డబ్ల్యూ, సీఎంఈ విభాగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

ఆరిలోవ : సీజనల్ వ్యాధులపై అందరికీ అవగాహన అవసరమని మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి నగేష్ అన్నారు. జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులకు మలేరియా విభాగం అధికారులు మంగళవారం మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ కారక దోమల గురించి వివరించారు. దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, ఉపాధ్యాయులు, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయోగాత్మక చిత్రం 'కళ్లు'

సీతంపేట: 'కళ్లు' ఒక ప్రయోగాత్మక చిత్రమని, విశాఖలోని ఎంతో మంది వ్యక్తుల సహకారంతో స్థానిక కళాకారులను పెట్టి ఈ చిత్రం తీశామని దర్శకుడు ఎం.వి.రఘు అన్నారు. కళ్లు చిత్రం తీసి 35 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రంగసాయి మీడియా వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రఘు మాట్లాడుతూ స్వాతిముత్యం సినిమా వచ్చిన రోజుల్లో కళ్లు సినిమా తీశామన్నారు. గొల్లపూడి మారుతీరావు రచించిన నాటికను సినిమాగా తీశామని తెలిపారు. ఈ సినిమాకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడినపాటలు, సిరివెన్నెల సాహిత్యం సినిమాకి హైలెట్ అన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రఘు, ఇతర కళాకారులను సత్కరించారు. అనంతరం కళ్లు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, రంగసాయి ప్రతినిధి ఎన్.నాగేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కళ్లు చిదంబరం కుమారుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌కు అభినందనలు



జీవీఎంసీ కమిషనర్‌ను అభినందిస్తున్న నాయకులు



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్

అల్లిపురం: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.సంపత్‌కుమార్‌ను గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు జీవీఎంసీ ఎంప్లాయీస్ గౌరవాధ్యక్షుడు ఆనందరావుతో కలిసి మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ కిరణ్‌కుమార్ యాదవ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, నాయకులు బీవీ అశోక్‌కుమార్, ఇ. పవన్‌కుమార్, చింతకాయల బంగార్రాజు, జి. శ్యామలరావు, సురేంద్ర, కర్రి రాజేష్, పి. నాగేశ్వరరావు, చంద్రబాబునాయుడు తదితరులు ఉన్నారు.

నగరాభివృద్ధిపై చర్చ..

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి. సంపత్‌కుమార్‌ను డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. నగరాభివృద్ధిపై కమిషనర్‌తో కాసేపు చర్చించారు. జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సంపత్‌కుమార్‌ను జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం. ఆనందరావు నేతృత్వంలో యూనియన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నగర ప్రజలకు కనీస వసతులు, సౌకర్యాలు కల్పించడంలో జీవీఎంసీ ఉద్యోగులు ముఖ్య భూమిక పోషిస్తున్నారని, ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టాలని కమిషనర్‌ను కోరగా అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టు ఆనందరావు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బొట్టా ఎర్రాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ జీవీ కుమార్, డ్రైవర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోన భాస్కర్, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు కనకరాజు, రామకృష్ణ, శ్రీను, సూపర్‌వైజర్ల అసోసియేషన్ నాయకులు నమ్మి రాజు, సత్తిబాబు, సారిపల్లి సంతోష్, కింతాడ శ్రీనివాస్, సూరిబాబు, రెల్లి సత్యం, రామకృష్ణ, రవి, దుర్గాప్రసాద్, జీవన్, సాగర్‌మూర్తి, నాయుడు, రఘు, మలేరియా విభాగం నుంచి కన్నబాబు, రమాదేవి, కొండమ్మ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

డాబాగార్డెన్స్: ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హైర్‌బస్ డ్రైవర్ల సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి, ప్రాంతీయ మేనేజర్ అప్పలరాజుకు సిటు జిల్లా నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఏపీపీటీడీ ఎండీ ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం కార్మికులందరికీ కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వర్తింప జేయాలని కోరారు. ప్రతి నెలా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్మికులకు, బస్‌పాస్ సెక్షన్, టికెట్ కౌంటర్, లాజిస్టిక్, అద్దె బస్సు డ్రైవర్లకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని, డ్రైవర్ల రిక్రూట్‌మెంట్‌లో అద్దె బస్సు డ్రైవర్లకు ప్రాధాన్యం కల్పించాలని, ప్రభుత్వ జీవో ప్రకారం కార్మికులకు జీతాలు చెల్లించాలని, వారాంతపు సెలవులు, పండగ సెలవులు వర్తింప జేయాలని ఆ వినతిలో పేర్కొన్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఇస్తున్న సర్క్యులర్లను కార్మికులకు తెలిసేలా నోటీస్ బోర్డులో డిస్‌ప్లే చేయాలని కోరారు. దీనికి ఆర్టీసీ ఆర్‌ఎం స్పందిస్తూ తన పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని, మిగిలిన వాటిని ఎండీ దృష్టికి తీసుకెళ్తానని, కార్మికులకు సమాచారం తెలిసే విధంగా నోటీస్ బోర్డులో సర్క్యులర్లు డిస్‌ప్లే చేస్తామన్నారని ఆర్‌ఎంను కలిసిన సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఆర్టీసీ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తులసీరామ్, జిల్లా కార్యదర్శి పి. వెంకట్రావు తెలిపారు.



ఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న సిటు నాయకులు

ఎన్‌సీసీతో సేవాభావం సొంతం

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో కెరీర్ ఆపర్చునిటీస్ ఇన్ ఆర్మీ ఫోర్స్ ఇన్ ఇండియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుతూ యువత దేశాభిమానం, సేవాభావాన్ని చాటుకునేందుకు ఎన్‌సీసీ చక్కటి అవకాశం కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ వైవీహెచ్ఎస్ ప్రసాద్ ఆర్మీ ఫోర్స్‌లో ఉన్న అవకాశాల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ కె. గీతాంజలి మాట్లాడుతూ దేశాన్ని రక్షించే సైనికులకు ఎంతటి గౌరవం ఉంటుందో, అంతటి గౌరవం ఎన్‌సీసీ క్యాడెట్లకు కూడా లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.



రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ ప్రసాద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఉక్కునగరం: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం నిర్వహించారు. స్టీల్ బీఎంఎస్ ఆధ్వర్యంలో ఉక్కు టీటీఐ కూడలి, యూనియన్ కార్యాలయాల వద్ద జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు పార్టీ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1993లో స్టీల్ ప్లాంట్‌లో బీఎంఎస్ యూనియన్ ప్రారంభమైందన్నారు. బీఐఎఫ్ఆర్ సమయంలో నాటి ప్రధాని వాజ్‌పేయి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, స్టీల్‌ప్లాంట్ రక్షణలో కీలక పాత్ర పోషించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఉద్యోగుల హెచ్ఆర్ఏ పరిష్కారంలోనూ ముఖ్య భూమిక వహించిందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రామస్వామి, జె.రమణ, గురుప్రసాద్, మద్దాల పెంటారావు, కార్యవర్గ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



ఉక్కు టీటీఐ కూడలి వద్ద జెండా ఎగరవేస్తున్న బీఎంఎస్ నాయకులు

ఫార్మా రంగంలో మెండుగా ఉపాధి అవకాశాలు

అగనంపూడి: ఫార్మారంగంలో మెండుగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని అమెరికాకు చెందిన డాటా పరిశోధకుడు వెంకట్ ఇకుర్తి అన్నారు. ఆ దిశగా పరిశోధనలు సాగించాలని సూచించారు. 'ఫార్మా రంగంలో పరిశోధనలు - స్టాటిస్టికల్ విద్య' అంశంపై దువ్వాడలోని విజ్ఞాన్ ఫార్మా కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్లినికల్ రీసెర్చ్, సాస్ ప్రోగ్రామ్‌ల గురించి వివరించారు. ఫార్మా రంగంలో అవకాశాలు, కెరీర్‌పై విద్యార్థులు దృష్టి సారించారు. ఔషధ ఆవిష్కరణ, డ్రగ్ డెవలప్‌మెంట్, క్లినికల్ ట్రయల్స్, స్టాటిస్టికల్ విద్యపై వివరించారు. కార్యక్రమంలో ఫార్మసీ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కమల కుమారి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వసుధ, వివిధ విభాగాల అధిపతులు సరిత, చిరంజీవి, వసంత, రంజిత తదితరులు మాట్లాడారు.

శాకంబరిగా భూలోమ్మవారు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డు, రేసపువానిపాలెం గ్రామంలో వెలసిన శ్రీ భూలోమ్మ అమ్మవారు శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు కూరగాయలతో అమ్మవారిని అలంకరించినట్టు అర్చకుడు సంతోష్ శర్మ తెలిపారు. గ్రామప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు బేరి గురునాథ్‌రెడ్డి, ఆలయ సెక్రటరీ జీరి అప్పలస్వామి రెడ్డి, కోశాధికారి గాలి శివకుమార్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ మజ్జి ఉమామహేశ్వ రరెడ్డి, యాదేశ్వరరెడ్డి, మోకర సాయి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు నేడు

సీతమ్మధార : ద్వారకానగర్‌లోని ఉపాధ్యాయ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 24 డీఎస్సీ, టెట్, ఎస్జీటీ, అల్ స్కూల్ అసిస్టెంట్లకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాండ్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ఫీజు రాయితీ పొందవచ్చని, వివరాలకు 9849486893 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010810033, 9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com